క్లుప్తంగా

కౌలు రైతుల గుర్తింపు కార్డులపై అపోహలొద్దు



మాట్లాడుతున్న తహసీల్దార్ రత్నరాధిక

కూడేరు: కౌలు రైతుల గుర్తింపు కార్డుల మంజూరుపై ఎలాంటి అపోహలొద్దని, ప్రభుత్వం అందించే రైతు భరోసా, వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా కలిగే లబ్ధి భూయజమానికి, కౌలు రైతుకు కూడా వర్తిస్తుందని తహసీల్దార్ రత్నరాధిక, ఏఓ విజయ కుమార్ తెలిపారు. గురువారం కూడేరు తహసీల్దార్ కార్యాలయంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డు మంజూరుపై రైతు సేవాకేంద్రం సిబ్బందికి, వీఆర్వోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మొక్కలను నాటుతున్న ఎంపీడీఓ గూడెన్న, ఏపీఓ, సిబ్బంది

కణేకల్లు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీఓ గూడెన్న పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద మొక్కలను పెంచుకోవాలన్నారు. వాతావరణ కాలుష్యం నియంత్రణకు చెట్లు ఎంతో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు లక్ష్మన్న, భవానీశంకర్, ఏపీఓ సుధాకర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ స్వర్ణలత, సీనియర్ అసిస్టెంట్ హనుమంతప్ప, పాల్గొన్నారు.

కూడేరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని పరిరక్షిద్దామని ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారి నాగభూషణరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కూడేరు ఎమ్మార్సీ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఏఓ నాగభూషణ రెడ్డి, ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంఈఓ చంద్రశేఖర్, ఎంఈఓ-2 సాయి కృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫాతిమా, పంచాయతీ కార్యదర్శులు పావని, రఘు, సీఆర్పీలు రమణ, శివ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిచాలని ఏఐఎస్ఎఫ్ నాయకలు డిమాండ్ చేశారు. గురువారం కళ్యాణదుర్గంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షులు హర్షవర్ధన్, ఉపాధ్యక్షుడు మురళి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ బీసీ, ఎస్సీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి ఈనెల 20 నుంచి 30 వరకు అన్ని జిల్లాల్లోనూ పోరాటం చేస్తామన్నారు.

క్రీడాకారుడికి ఆర్థికసాయం

బెళుగుప్ప: మండల పరిధిలోని శ్రీరంగాపురానికి చెందిన వాల్‌బాల్ క్రీడాకారుడు సంతోష్ జాతీయ వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈనెల 23 నుంచి రాజస్థాన్‌లోని నోహర్ జిల్లాలో జరిగే వాల్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. బ్రాహ్మణపల్లి ఉపాధ్యాయుడు లక్ష్మన్న, మండల విద్యాధికారులు మల్లారెడ్డి, హరికృష్ణ, బెళుగుప్ప హెచ్‌ఎం వెంకటప్రసాద్, ఎంఆర్సీ కార్యాలయ సీఆర్ఎంటీలు కలిసి రూ.21,500 నగదు అందించారు. హెచ్‌ఎం బాలాజీ రూ.5వేలు అందించారు.

దోమలబారిన పడకుండా జాగ్రత్తలు పాటించండి

విడపనకల్లు: మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండ రామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ చేశారు. దోమల ద్వారా మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర జ్వరాలు వస్తాయని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో విడపనకల్లులో ఎంపీడీఓ కొండయ్య, ఈఓఆర్డీ సత్యబాబు, పంచాయతీ కార్యదర్శులు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన



మాట్లాడుతున్న వై.భీమిరెడ్డి

వజ్రకరూరు: టీడీపీ అధికారంలోకొచ్చిన తర్వాత రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తనయుడు, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.భీమిరెడ్డి అన్నారు. గురువారం కొనకొండ్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చిత్తూరులో గురువారం ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్పలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీ రెడ్డప్ప ఇంటికి వెళ్లిన ఎంపీ మిథున్‌రెడ్డిపై టీడీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వడంతోపాటు కార్లను ధ్వంసం చేయడం సరికాదన్నారు. టీడీపీ అధికారంలోకొచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులకు దిగుతున్నారన్నారు. వినుకొండలో పట్టపగలు రషీద్ అనే వ్యక్తిని దారుణంగా హత్య చేయడాన్ని చూస్తే శాంతిభద్రతలు ఏ మేరకు ఉన్నాయే ఇట్టే అర్థమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలకు పెద్దపీట వేసి, పార్టీలకతీతంగా అన్ని వర్గాల వారికీ సంక్షేమ పథకాలు అందించినట్లు గుర్తు చేశారు.

కుష్టు..పుట్టుకొస్తోంది జాగ్రత్త!

- ఏటేటా బయటపడుతున్న కొత్త కేసులు
- కట్టడి చేసేందుకు లెప్రసీ అధికారుల చర్యలు
- ప్రారంభమైన ఇంటింటా సర్వే
- రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ డివిజన్లలో 400 మందికి పైగా బాధితులు



రాయదుర్గంలోని శాంతినగర్ ఏపీహెచ్‌సీ వద్ద సర్వే టీమ్‌ను ప్రారంభిస్తున్న లెప్రసీ అధికారులు



కుష్టు వ్యాధి సోకితే ఇలా..

రాయదుర్గం: పూర్తిగా తొలగిపోయినట్లు భావిస్తున్న 'కుష్టు' చాపకింద నీరులా విస్తరిస్తోంది. నిర్లక్ష్యం చేసిన వారి ఆరోగ్యాన్ని కబళిస్తోంది. వైద్య రోగ్యశాఖ అధికారులు పట్టణాలు, పల్లెల్లో ఇంటింటా తిరిగి సర్వే చేస్తూ బాధితులను గుర్తిస్తున్నారు. పట్టణంలోని శాంతినగర్‌లో ఉండే అర్బన్ పీహెచ్‌సీ వద్ద గురువారం డిప్యూటీ పారా మెడికల్ అధికారి హెచ్ నీలకంఠ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించే పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ప్రారంభించిన సర్వే ఆగస్టు 2 వరకు కొనసాగుతుంది. వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ఉచితంగా మందులు అందిస్తారు.

జిల్లాలోనే రాయదుర్గం నియోజకవర్గంలో కుష్టు వ్యాధి లక్షణాలు అధికంగా కనిపిస్తున్నాయి. డివిజన్‌లో ప్రతి నెలా 10 నుంచి 12 కొత్త కేసులు వెలుగుచూస్తే.. అందులో ఎక్కువ భాగం రాయదుర్గం నియోజకవర్గంలోనే ఉంటున్నాయి. ఇది కాస్త ఆందోళన కలిగిస్తోంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో గత మూడేళ్ల నుంచి సుమారు 400 మందికి పైగా కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించారు. ఇందులో 300 మందికి పైగా చికిత్స పొంది కోలుకున్నారు. ప్రస్తుతం రాయదుర్గంలో 65, కళ్యాణదుర్గంలో 30, ఉరవకొండలో 36 కేసులు ఉన్నాయి. ఆగస్టు 2 తర్వాత ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుందని వైద్యశాఖ భావిస్తోంది.

కుష్టు ..అంటువ్యాధి కాదు..

కుష్టు అంతగా అంటువ్యాధి కాదు..వ్యాధి సోకిన వారితో సన్నిహితంగా ఉన్నప్పుడు మాత్రమే సంక్రమిస్తుంది. పూర్తిగా నయం కాని జబ్బేమీ కాదని వైద్య నిపుణులు చెప్తున్నారు. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి సక్రమంగా మందులు వాడినట్టయితే కోలుకోవచ్చంటున్నారు. నిర్లక్ష్యం చేస్తేనే కబళిస్తోందని హెచ్చరిస్తున్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులు వారి కుటుంబ సభ్యులతో కలసి జీవించొచ్చు. కుష్టు లైంగికంగానూ సంక్రమించదు. గర్భం ద్వారా పుట్టబోవు బిడ్డకు వ్యాపించదు. వ్యాధి సోకిన వ్యక్తి ముక్కు ద్రవంతో దగ్గు లేదా స్పర్శ ద్వారా వ్యాప్తి చెందుతుంది. రోగ నిరోధక శక్తిని బట్టి 95 శాతం మందికి వ్యాధి సోకినా అభివృద్ధి చెందదు. కుష్టులోనూ రెండు రకాల వ్యాధులు ఉంటాయి. పాసిబాసిల్లరీ వ్యాధి ఉన్న వ్యక్తికి శరీరంపై ఐదు రకాల మచ్చలు ఉంటాయి. మల్టీబాసిల్లరీ వ్యాధి సోకిన వ్యక్తి శరీరంపై ఐదు కంటే ఎక్కువ మచ్చలు ఉంటాయి. స్పర్శ ఉండదు. చర్మం బయాప్సీలో యాసిడ్ ఫాస్ట్ బాసిల్లిని కనుగొనడం వల్ల రోగాన్ని నిర్ధారిస్తారు. మల్టీ డ్రగ్స్ థెరపీతో కుష్టు వ్యాధిని నయం చేసుకోవచ్చు. పాసిబాసిల్లరీ కుష్టుకు ఆరు నెలల పాటు డాప్సోన్, రిఫాంపిసిన్, క్లోఫాజిమైన్ మందులతో మల్టీబాసిల్లరీ వ్యాధి గ్రస్తులకు 12 నెలల పాటు చికిత్స అందిస్తారు.

రూపుమాపడమే లక్ష్యం



కుష్టువ్యాధిని అంతం చేయడమే లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తున్నాం. జిల్లాలో మిగతా చోట్ల కంటే రాయదుర్గంలో కుష్టు వ్యాధి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీన్ని అరికట్టేలా ప్రత్యేక చర్యలు చేపట్టాం. ప్రస్తుతం 65 కేసులకు చికిత్స అందిస్తున్నాం. సర్వే తర్వాత ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కళ్యాణదుర్గంలో 30, ఉరవకొండలో 36 కేసులు ఉన్నాయి. ఇందులో కొన్ని నయమయ్యాయి. వ్యాధి సోకిన వారు ఎలాంటి బయాందోళన చెందకుండా జాగ్రత్తగా మందులు వాడితే నయమవుతుంది. వైద్యుల సలహా, సూచనలు పాటించాలి. ఇంటివద్దకు వచ్చే సర్వే బృందానికి ప్రజలు సహకరించాలి. వ్యాధి ఉన్నట్టు తేలితేనే నయం చేసేందుకు వీలవుతుంది. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలి.

– హెచ్.నీలకంఠ. డిప్యూటీ టీబీ, లెప్రసీ అధికారి

గ్రామాల్లో లెప్రసీ వ్యాధి గుర్తింపు సర్వే



కాలువపల్లిలో ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



కుందుర్పిలో ర్యాలీ చేస్తున్న దృశ్యం



బొమ్మనహాళ్‌లో కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బెళుగుప్ప /కుందుర్పి/బొమ్మనహాళ్/ గుమ్మఘట్ట: మండలంలోని గ్రామాల్లో కుష్టు బాధితులను గుర్తించేందుకు సర్వే చేస్తున్నట్లు వైద్యాధికారి కార్తీక్‌రెడ్డి తెలిపారు. గురువారం బెళుగుప్ప మండలంలోని కాలువపల్లి హెల్త్ క్లినిక్‌లో లెప్రసీ వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేలో పాటించాల్సిన మెలకువలపై ఏఎన్ఎంలు, ఆశ వర్కర్‌లు, హెల్త్ అసిస్టెంట్లకు హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణతో కలిసి అవగాహన కల్పించారు. గ్రామంలో పోస్టర్లు, ప్లెక్సీలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కుష్టు వ్యాధి ప్రమాదకరం..

కుష్టు వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చేపట్టాల్సిన చర్యలపై గురువారం కుందుర్పి వైద్యాధికారులు అనూషా, చాంద్‌బేగం, నారాయణస్వామి, పర్యవేక్షణలో బెస్తరపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం బెస్తరపల్లిలో ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ..

కుష్టువ్యాధి నివారణకు ఎల్‌సీడీసీ సర్వేను అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యులు రమేష్ తెలిపారు. గుమ్మఘట్ట మండల కేంద్రంలో కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు బాలాజీనాయక్, నందేశ్‌కుమార్, సీహెచ్ఓ మురళీధర్, సూపర్‌వైజర్ ఆదిబయమ్మ, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు సహకరించండి ..

కుష్టు వ్యాధి నిర్మూలనలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మీ, మల్లీశ్వరి అన్నారు. గురువారం బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో కుష్టు వ్యాధిపై ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు సర్వే చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, జైనాబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటితేనే మనుగడ

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటితేనే మనుగడ సాధ్యమని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈఓపీఆర్‌డీ దాస్, ఏపీఓ రమేష్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి

బెళుగుప్ప: ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని తహసీల్దార్ హరినాథ్‌రావు తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఇన్స్టిట్యూషనల్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ సుబ్బరాజు, ఎస్ఐ శివ, ఈఓఆర్‌డీ మాధవ్‌రెడ్డి, పంచాయతీ అధికారులతో కలిసి మొక్కలు నాటారు.

ముగిసిన సామాజిక తనిఖీలు

కూడేరు: మండలంలోని 14 పంచాయతీల్లో ఈ నెల 11 నుంచి క్షేత్ర స్థాయిలో చేపట్టిన సామాజిక తనిఖీలు గురువారం ముగిశాయి. 2023–24 ఏడాదిలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులు, సామాజిక భద్రతా పింఛన్ల నగదు పంపిణీపై సామాజిక తనిఖీలు నిర్వహించారు. చివరి రోజు ముద్దలాపురం, కలగళ్ల, కొర్రకోడు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ రాష్ట్ర రీసోర్స్ పర్సన్ లక్ష్మీనారాయణ ఆయా పంచాయతీల్లో చేపట్టిన క్షేత్ర స్థాయి తనిఖీల్లో వెలుగు చూసిన అంశాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో సర్పంచులు ధనుంజయ్య, సువర్ణ, చంద్రశేఖర్, ఏపీఓ తులసి ప్రసాద్, ఉపాధి, హార్టికల్చర్, సామాజిక తనిఖీ, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నిక



యాదవ సంఘం నూతన కమిటీ సభ్యులు

రాయదుర్గంటౌన్: శ్రీసంతాన వేణుగోపాలస్వామి, యాదవ సంఘం నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఎన్నిక జరిగింది. కమిటీ గౌరవాధ్యక్షులుగా రామ్మూర్తిస్వామి, బీఎస్ తిప్పేస్వామి, అగ్రహారం రామాంజనేయులు, మోపూరి చంద్రశేఖర్, మామిళ్ల కృష్ణప్రసాద్, జీఎస్ నరసింహులు, దాసరి తిమ్మప్ప, చిక్కన్న, ఏటూరి రామాంజనేయులు, నక్కా విరుపాక్షి, మోపూరి వసంతరాజు, మేకల శ్రీనివాసులు, లాయర్ లోకానంద, అధ్యక్షులుగా బంగి ఉమాశంకర్, ఉపాధ్యక్షులుగా రామస్వామి, జక్కల భాస్కర్, ప్రధాన కార్యదర్శులుగా కేడిమి లక్ష్మీనారాయణబాబు, మోపూరి రాజేష్, కోశాధికారిగా మూలింటి నాగరాజు, ఉప కోశాధికారిగా బత్తుల లోకేష్, ప్రచార కార్యదర్శులుగా ఆవుల మనోహర్, శిరివాళం ప్రసాద్, మోపూరి శ్రీకాంత్, అగ్రహారం కిరణ్, బంగి రమేష్, తరూరు జగదీష్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

ముగిసిన మొహర్రం

బొమ్మనహాళ్: మండల కేంద్రమైన బొమ్మనహాళ్, కొలగానహళ్లి, కృష్ణాపురం గ్రామాల్లో మొహర్రం వేడుకలు గురువారం ముగిశాయి. రెండు రోజుల నుంచి పానకాల ఊరేగింపు, చక్కెర చదివింపులు , బెల్లం తుకాలు ఇచ్చి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పీర్లను రంగురంగుల దుస్తులు, పూలతో అందంగా అలంకరించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. యువకులు, భక్తులు పీర్ల ఎదుట ఉత్సాహంగా చిందులు వేశారు. ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఎనుములదొడ్డిలో పీర్లను దర్శించుకున్న రంయ్య

కుందుర్పి: మండలంలోని ఎనుములదొడ్డిలో మొహర్రం సందర్భంగా మాజీ ఎంపీ తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి తదితరులు పీర్లను గురువారం దర్శించుకొని, చక్కెర చదివించారు. గూగూడు తరువాత జిల్లాలో ఎనుములదొడ్డిలో పెద్ద ఎత్తున మొహర్రం వేడుకలు జరుగుతాయి. గ్రామస్తుల ఆహ్వానం మేరకు మాజీ ఎంపీ రంగయ్య పీర్లను దర్శించుకొని పూజలు చేశారు. అడ్వొకేట్ హనుమంతరెడ్డి, స్థానిక సర్పంచ్ విజయ్, మాజీ ఉపసర్పంచ్ ఖాసీం, అప్పిలేపల్లి సర్పంచ్ అతావుల్లా తదితరులు పాల్గొన్నారు.

పీర్లస్వాములకు మొక్కులు తీర్చుకున్న భక్తులు

గుమ్మఘట్ట: మండలంలోని గలగల,కలుగోడు,గోనబావి,పూలకుంట,75 వీరాపురం గ్రామాల్లో 9వ రోజు సరిగెత్తు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు బెల్లంతో తయారు చేసిన పానకాన్ని పీర్లస్వాములకు సమర్పించారు. గలగల గ్రామంలో బెల్లం, చక్కెరతో తూకం వేసి స్వాములకు కానుకలను సమర్పించుకున్నారు.

జలధికి తరలిన పీర్లు

కంబదూరు: మత సామరస్యానికి ప్రతీక అయిన మొహర్రం వేడుకలు వైభవంగా జరిగాయి. మండలంలోని కంబదూరుతో పాటు కుర్లపల్లి గ్రామాల్లో కొలువుదీరిన పీర్లస్వాములకు గురువారం భక్తులు చక్కెర చదివింపులు చదివించి, భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పీర్లను జలధికి తీసుకెళ్లారు. ఎలాంటి ఘటనలు జరగకుండా ఎస్ఐ ఆంజనేయుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



కృష్ణాపురంలో ఊరేగుతున్న పీర్లు



కంబదూరులో జలధికి వెళ్తున్న పీర్లు



ఎనుములదొడ్డిలో పీర్లను దర్శించుకుంటున్న మాజీ ఎంపీ రంగయ్య తదితరులు

భక్తి శ్రద్ధలతో పెద్దసరిగెత్తు

శెట్టూరు: మండలంలోని శెట్టూరు, కనుకూరు, ములకలేడు, లక్ష్మంపల్లి, బచ్చేహళ్లి, కరిడిపల్లి గ్రామాలో ప్రజలు భక్తి శ్రద్ధలతో పెద్ద సరిగెత్తు నిర్వహంచారు. పీర్లస్వాములకు పానకాలు, చక్కెర, బెల్లంతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పానకాలతో ఊరేగంపుగా వెళ్లి అగ్ని గుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

వైభవంగా కాలబాయి పీర్లదేవుడి ఊరేగింపు

కణేకల్లు: కణేకల్లులో కాలబాయి పీర్లదేవుడి ఉత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఐదు రోజుల పాటు ప్రత్యేక ఫాతేహాలు, చదివింపులు చేయించుకొన్న కాలబాయి పీర్లదేవుళ్లను నిర్వాహకులు మధ్యాహ్న 3గంటలకు సాంప్రదాయబద్ధంగా పెద్ద పెట్టున టపాసులు పేల్చి సవారి ఎత్తారు. దిగువ వీధి నుంచి ఆస్పత్రి దిగువ వరకు కాలబాయి పీర్లదేవుళ్ల ఊరేగింపు కొనసాగింది. కాలబాయి పీర్ల ఉత్సవాలను తిలకించేందుకు భారీ సంఖ్యలో జనం తరలివచ్చారు. పీర్లపై బెల్లం చల్లి భక్తులు మొక్కుబడులను తీర్చుకున్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో మెయిన్‌రోడ్డు కిక్కిరిసింది. రోడ్లు, ఇంటిమిద్దెలెక్కి జనం వేడుకలను తిలకించారు.

సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతెహాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి సమాధి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో గురువారం భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గురువారం స్వామివారం కావడంతో భక్తులు స్వామి దర్శనార్థం ఆంధ్రా,కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి దర్శనానికి బారులుదీరారు. దర్గా పెద్దలు ఉదయం స్వామివారి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి, ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో కందూరీలు చేశారు.

గ్రంథాలయం తనిఖీ

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ గురువారం తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించారు. మండలంలోని పంచాయతీల నుంచి గ్రంథాలయానికి 8 శాతం సెస్ వసూలు కావాలన్నారు. పంచాయతీల నుంచి సక్రమంగా వసూలు చేయాలని గ్రంథాలయ అధికారి బాబా ప్రసాద్‌కు సూచించారు.

వైభవంగా పాండురంగస్వామి రథోత్సవం



రాయదుర్గంలో పాండురంగస్వామి రథోత్సవ దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డులోని రుక్మిణీ సమేత పాండురంగస్వామి రథోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పాండురంగస్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా రెండు రోజుల నుంచి విశేష పూజలు జరిగాయి. గురువారం రథోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై పుర వీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మురళి, రాజశేఖర్ సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గురుపూజ మహోత్సవం

ఉరవకొండ: గుంతకల్లు రోడ్డులోని ప్రసిద్ధ జగదీశ్వరీ ఆలయంలో ఈనెల 20 నుంచి గురుపూజ మహోత్సవం జరగనుంది. ఆలయంలో విశేష పూజలు, హోమాలు నిర్వహించనున్నారు. ఈనెల 20 నుంచి గీతాప్రచార సేవాసమితి ఆధ్వర్యంలో గీతాపారాయణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం ఉరవకొండ గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి గురుపూజోత్సవం విశిష్టతపై ప్రత్యేక ఉపన్యాసం ఉంటుంది. అనంతరం ప్రసిద్ధిగాంచిన ఉరవకొండ, పాలిక్కి, కొత్తకోట, హోతూరూ గ్రామాల భజన బృందంచే భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈనెల 21న జగదీశ్వరీ అమ్మవారికి విశేష పూజలు, విశ్వశాంతి పతాకావిష్కరణ, అనంతరం శాంతానంద రంగయ్య స్వామి పాదములకు పంచామృతాభిషేకం, గురుపూజ, అనంతరం విశేష హోమాలు నిర్వహిస్తారు.

వాహనదారులు హెల్మెట్ తప్పక వాడాలి



ఉరవకొండ: హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్, పోలీసులు



కళ్యాణదుర్గం: ర్యాలీని ప్రారంభిస్తున్న జడ్జి బండె సుభాన్



రాయదుర్గం: హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు, పోలీసులు, విద్యార్థులు

- న్యాయమూర్తి బండె సుభాన్

కళ్యాణదుర్గం: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ వాడాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి బండె సుభాన్ తెలిపారు. స్థానిక దొడగట్ట రోడ్డులోని బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నుండి ముదిగల్లు రోడ్డు క్రాస్ వరకు గురువారం హెల్మెట్ వాడకంపై 'వన్ కే వాక్' కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్పీ బి.శ్రీనివాసులు, సీఐలు నాగరాజు, హరినాథ్‌లతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చిన్నపిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇచ్చి ప్రోత్సహించడం నేరమన్నారు. అవగాహన లేక రోడ్లపై ఇష్టారాజ్యంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన వారంతా హెల్మెట్ వినియోగించకపోవడం వల్లే ఎక్కువగా మృతి చెందారన్నారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ వాడేలా చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, న్యాయవాదులు, విశ్రాంత ఉద్యోగులు, యువత, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

- ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గా కళ్యాణి

ఉరవకొండ: హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని, వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడాలని ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి సూచించారు. గురువారం ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణం నుంచి న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ చేశారు. అనంతరం ర్యాలీనుద్దేశించి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ మాట్లాడారు. హెల్మెట్ వాడకం తప్పనిసరి అంటూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నా.. చాలా మంది వాహనదారులు హెల్మెట్ వాడలేదన్నారు. హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని, ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. దీంతో పాటు ప్రతి ఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. ర్యాలీలో బార్ అసోసియేషన్ సభ్యులు, ఉరవకొండ అర్బన్ సీఐ సురేష్‌బాబులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదు

రాయదుర్గంటౌన్: హెల్మెంట్ లేకుండా వాహనాలు నడపడం ప్రమాదకరమని పట్టణంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, పోలీసులు, విద్యార్థులు ప్లకార్డులు చేత పట్టుకొని ర్యాలీ చేశారు. కోర్టు వద్ద నుంచి లక్ష్మీబజార్ మీదుగా వినాయక సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ జరిగింది. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు వెంకటరెడ్డి, లోకానంద, పోలీసులు మురళి, బాలు,రఘు, రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.